క్లుప్తంగా

నేటి నుంచి తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు



తంటికొండలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని స్వామివారి ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, రంగులతో సుందరంగా అలంకరించారు. ఈ నెల 18 నుంచి 24 వరకూ ఏడు రోజుల పాటు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. తొలిరోజు శనివారం స్వామి, అమ్మవార్లను పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెను చేస్తారు. ఆదివారం రాత్రి ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలోని మండపంలో స్వామివారి కల్యాణం కన్నులపండువగా నిర్వహిస్తారు. ఈ నెల 23న స్వామివారి గ్రామోత్సవం, 24న ఊయల సేవ, శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ శుక్రవారం తెలిపారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు కల్యాణోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్ల లాగడం, వాంతులు, చలి జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

కిర్లంపూడి: జగపతినగరంలో వేంచేసిన అభయ దుర్గమ్మ, కిర్లంపూడి గ్రామ శివారున వేంచేసిన వనదుర్గమ్మ అమ్మవారి ఆలయాల వద్ద శుక్రవారం అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

22న మండల సమావేశం

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.ప్రేమ్‌సాగర్ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

శాఖల పనితీరుపై ఆరా



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ భావన, కమిషనర్ వెంకటరావు

కాకినాడ: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని వివిధ విభాగాధిపతులతో ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన శుక్రవారం సమావేశమయ్యారు. కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. శాఖల వారీగా కార్యకలాపాలను సమీక్షించారు. ట్రైనీ కలెక్టర్ హోదాలో విభాగాల వారీగా శాఖల పనితీరు, విధి విధానాలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓటర్లలో పోటెత్తిన చైతన్యం

- రాజుపేటలో రికార్డు స్థాయిలో 96 శాతం పోలింగ్
- అత్యల్పంగా తుని బ్యాంకు కాలనీలో 62.20 శాతం నమోదు
- బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు వెల్లడించిన అధికారులు



అల్లిపూడిలో ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు (ఫైల్)

తుని రూరల్: తుని నియోజకవర్గంలోనే అత్యధికంగా తుని మండలం రాజుపేట 76 నంబర్ బూత్‌లో 96.01 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో బూత్‌ల వారీగా పోలైన ఓట్లు వివరాలను శుక్రవారం అధికారులు వెల్లడించారు. రాజుపేటలో 75, 76 నంబర్లతో రెండు బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. 75వ నంబర్‌లో బూత్‌లో 974 మందికి గాను 906 (93.01 శాతం), 76వ నంబర్ బూత్‌లో 1129 మందికి గాను 1084 (96.01 శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యల్పంగా తుని పట్టణం బ్యాంకు కాలనీలో విద్యావంతులు, ఉద్యోగులు, రాజకీయ ప్రముఖులు ఉండే 127 నంబరు బూత్‌లో 1331 మందికి 828 (62.20 శాతం) మంది ఓటు వేశారు. నియోజకవర్గంలోని తుని, కోటనందూరు, తొండంగి మండలాలు, తుని పట్టణం ఓటర్లు ఉండగా తుని మండల ప్రజలు అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తుని మండలంలో 66,718 మందికి 58,613 (87.85 శాతం) మంది, తుని పట్టణంలో 42,970 మందికి గాను 31,173 (72.54 శాతం) మంది, తొండంగి మండలంలో 75,194 మందికి గాను 62,630 (83.29 శాతం) మంది, కోటనందూరు మండలంలో 39,656 మందికి గాను 34,799 (87.75 శాతం) మందికి ఓటు వేశారు. నియోజక వ్యాప్తంగా 224 పోలింగ్ బూత్‌ల్లో 2,24,538 మంది ఓటర్లలో 1,87,215 మంది (83.38 శాతం) మంది ఓటు వేశారు. తుని పట్టణం, తొండంగి, కోటనందూరు మండలాలతో పోలిస్తే తుని మండలంలో 0.10 శాతం మంది అధికంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గంతో పోల్చితే తుని మండలంలో 4.47 శాతం అధికంగా ఓట్లు పోలయ్యాయి.

కోటనందూరు మండలంలో 88 శాతం పోలింగ్

కోటనందూరు: మండలంలోని ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మునుపెన్నడూ లేనివిధంగా పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లేశారు. మండలంలో 39,656 మంది ఓటర్లకు గాను 34,799 (88 శాతం) మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటేసిన వారిలో 17,149 మంది పురుష ఓటర్లు ఉండగా 17,652 మంది మహిళా ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా టీజే నగరంలో 93 శాతం ఓట్లు పోలవ్వగా అత్యల్పంగా కోటనందూరులో 80 శాతం ఓటింగ్ నమోదైంది. కేఓ అగ్రహారం, కేఏ మల్లవరం, పాతకొట్టాం, ఎస్సార్‌పేట, భీమవరపుకోట గ్రామాల్లో 90 శాతం ఓటర్లు ఓటు వేశారు. బిళ్లనందూరు, ఎల్లీపేట, కేఈ చిన్నయ్యపాలెం, కాకరాపల్లి గ్రామాల్లో 89 శాతం ఓట్లు పోలవగా బొద్దవరం, జగన్నాథపురం, ఇండుగపల్లి, అల్లిపూడి గ్రామాల్లో 88 శాతం, అప్పలరాజుపేటలో 87 శాతం, కొత్త కొట్టాంలో 86 శాతం ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

మెజార్టీపై ఇరు పార్టీల ధీమా

కోటనందూరు మండలంలో మెజార్టీపై అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గత పదేళ్లగా మంత్రి దాడిశెట్టి రాజా చేసిన సేవలకు తమ పార్టీ మెజారిటీ సాధిస్తుందని వైఎస్సార్ సీపీ శ్రేణులు చెబుతున్నారు. ప్రభుత్వ పాలన, స్థానిక నాయకులపై ఉన్న వ్యతిరేకత, గతం కన్నా పెరిగిన ఓటింగ్ శాతం తమ పార్టీకి అనుకూలిస్తుందని టీడీపీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. కాగా ప్రజలు ఎవరు పక్షాన ఉన్నారనేది తెలియాలంటే జూన్ 4వ తేదీ వరకూ వేచి చూడాల్సిందే.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. పట్టణంలో గత రెండు రోజులుగా దుర్గారావు, సుధీర్ మెమోరియల్ కికెట్ టోర్నీని నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన పలు జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. రోజుకు రెండుమ్యాచ్‌లు చొప్పున నిర్వహిస్తున్నారు. శుక్రవారం పోటీలు హోరాహోరీగా సాగడంతో చూసేందుకు భారీగా యువకులు, ప్రజలు తరలివచ్చారు. పోటీల్లో విన్నర్ జట్టుకు రూ.33,333 రన్నర్స్‌కు రూ.22,222 నగదు బహుమతులు ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తుని: పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. బాలకోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తుని మండల న్యాయ సేవాధికార సంస్థ పరిధిలోని తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి మండలాల ప్రజలకు సంవత్సర కాలం పాటు పారాలీటల్ వలంటీర్‌గా సేవలందించేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తులను జూన్ 20వ తేదీ లోగా తుని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

చివరిలో కలవరం



ప్రత్తిపాడు-లంపకలోవ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం


- అన్నదాతలను వెంటాడుతున్న అకాల వర్షాలు
- ఆదరాబాదరాగా పంట ఒబ్బిడి

ప్రత్తిపాడు: రబీ వరిసాగు చేసిన రైతులు అకాల వర్షాలకు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలించడంతో నిన్నమొన్నటి వరకూ రబీ సాగు సజావుగా సాగింది. పంట చేతికి వచ్చే తరుణంలో వాతావరణ మార్పులతో పాటు వర్షాలు అకాల వర్షాలు కురవడంతో అన్నదాతలు అష్ట కష్టాలు పడుతున్నారు. వాతావరణంలోని ప్రతికూల పరిస్థితిని చూసి రైతుల గుండె చెరువుగా మారుతోంది. అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

4,500 ఎకరాల్లో సాగు

ప్రత్తిపాడు మండలంలో ఈ ఏడాది సుమారు 4,500 ఎకరాల్లో రైతులు రబీ వరిసాగు చేపట్టారు. రైతులు ఎక్కువగా ఎంటీయూ 1156, 1121, ప్రైవేటు వంగడాలైన లీడరు, సంపద, సాధన తదితర రకాలను సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే దశకు చేరుకుంది. వాతావరణ మార్పులను గమనించిన రైతులు ఆదరా బాదరాగా కోతలు మొదలు పెట్టారు. పలు గ్రామాల్లో ఇప్పటికే రైతాంగం పంటను ఒబ్బిడి చేసుకుంది. ప్రత్తిపాడు, ఏలూరు, లంపకలోవ, పెదశంకర్లపూడి, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు తదితర గ్రామాల్లో ధాన్యం రాశులు ఉన్నాయి. రెండు రోజుల పాటు చదురుమదురుగా వర్షాలు కురవడంతో కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను బరకాలు, ప్లాస్టిక్ కవర్లతో కప్పారు. శుక్రవారం వర్షం విరామం ఇచ్చింది. దీంతో రైతులు తడిసిన ధాన్యం రాశులను రోడ్లపై ఆరబెట్టారు. వ్యవసాయ శాఖ జగ్గంపేట ఇన్‌చార్జి ఏడీఏ యింటి వీర గంగాధర్ తన సిబ్బందితో ప్రత్తిపాడు, ఏలూరు, టి. రాయవరం తదితర గ్రామాల్లో పర్యటించారు. వర్షం నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తడిసిన వరి పనలపై ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు.

మామిడిపండ్లతో కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ



మామిడి పండ్లు అలంకారంలో దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మకు శుక్రవారం మామిడిపండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. విశ్వ హిందూ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు సహకారంతో సుమారు 1,116 మామిడిపండ్లతో అమ్మవారి మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మామిడి పండ్లను నివేదించి వాటిని భక్తులకు ప్రసాదంగా అందజేశారు. విశేష సంఖ్యలో భక్తులు కనకదుర్గమ్మను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అభివృద్ధికి కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దొరబాబు

గండేపల్లి: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేద్దామని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేద్దామన్నారు. పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ఎంపీడీఓ వి.హనుమంతరావు, ఈఓపీఆర్డీ మూర్తి, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

‘వరుపుల’ను కలసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



లింగంపర్తిలో వరుపులను కలసిన వాకపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావును శుక్రవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో లింగంపర్తిలోని వరుపుల ఇంటి వద్ద ఆయనను కలిసి సంఘీభావం తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ వచ్చే నెల 4న వెలువడే సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. గతంలో ఎన్నడూ, ఏ పార్టీకి రానన్ని సీట్లు వైఎస్సార్ సీపీకి వస్తాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

గోకవరం: మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఎంపీడీఓ గోవిందు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసి ఎంపీడీఓ కార్యాలయానికి తీసుకువచ్చిన చేతిపంపు రిపేరు సామగ్రిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీల్లో 438 చేతిపంపు బోర్లు ఉన్నాయన్నారు. వీటిని ఆయా పంచాయతీ నిధులతో ఎప్పటికప్పుడు రిపేరు చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. ఇంకా 77 చేతిబోర్లు రిపేరు చేయించాల్సి ఉందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి అవసరమైన రిపేరు సామగ్రిని కొనుగోలు చేశామన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు వీటిని తీసుకువెళ్లి చేతిబోర్లు రిపేరు చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.



చేతిబోర్ల రిపేరు సామగ్రిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోవిందు

ఒత్తిడిలేని జీవనమే ఆరోగ్యకరం

- ఘనంగా ప్రపంచ బీపీ దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు



ప్రత్తిపాడు సీహెచ్‌సీ ముఖద్వారం వద్ద ప్లకార్డులతో ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రత్తిపాడు: ఒత్తిడిలేని జీవనమే ఆరోగ్యకరమని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరిటిండెంట్ డాక్టర్ సౌమ్య అన్నారు. ప్రపంచ బీపీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో బీపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ బీపీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లాబ్ టెక్నీషియన్ బి.సుబ్బారావు వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీహెచ్‌సీ ముఖద్వారం వద్ద సిబ్బంది ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సూరిశెట్టి భాస్కర్, దోశ గంగాధర్, ఎస్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీపీ నివారణపై అవగాహన

కిర్లంపూడి: ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ప్రజలకు బీపీపై అవగాహన కల్పించారు. ముక్కొల్లులో వీరవరం పీహెచ్‌సీ వైద్యుడు పి.రవికుమార్ రక్తపోటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బంది పలువురికి బీపీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై ఆక్రమణల తొలగింపు



గోకవరంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

గోకవరం: గ్రామంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డుపైకి చొచ్చుకు వచ్చిన ఆక్రమణలు తొలగిస్తున్నారు. ఎస్సై కె.నాగరాజు ఆధ్వర్యంలో పంచాయతీ అధికారుల సహకారంతో శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభించి ఆంజనేయస్వామి గుడి సెంటర్ మీదుగా రహదారికి ఇరువైపులా ఉన్న హోర్డింగ్‌లు, షెడ్లు వంటివి తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారస్తులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆక్రమణలు తొలగించడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా ధ్వజారోహణం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం నిర్వహించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు నిత్యపూజలు, కైంకర్యాలు నిర్వహించారు. గోవింద మాలధారణ భక్తులు స్వామివారికి పల్లకీ సేవ చేశారు. యాగశాల ప్రవేశం, అగ్నిపూజ, మండలారాధన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

స్ట్రాంగ్ రూమ్ భద్రత పరిశీలన



స్ట్రాంగ్ రూము భద్రతను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: జేఎన్‌టీయూకేలో భద్రపరచిన ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థ, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి జేఎన్‌టీయూకే సివిల్ ఇంజినీరింగ్ బ్లాక్ వద్ద ఉన్న ఈవీఎం స్ట్రాంగ్ రూమును, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు శుక్రవారం స్థానిక జేఎన్టీయూకే సివిల్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏఆర్వో చెల్లన్న దొర ఇతర అధికారులతో కలసి స్ట్రాంగ్ రూమ్ కు వెళ్లిన ఆయన అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలకు మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం పర్యవేక్షించేలా ఇద్దరు గెజిటెడ్ అధికారులను కూడా నియమించామని ఆర్వో వెంకటరావు తెలిపారు. ఆయన వెంట పలువురు ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

పరిశీలించిన జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: పిఠాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి శుక్రవారం స్థానిక జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన ఈవీఎంలు ఇతర ఎన్నికల సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులతో కలసి స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లి అక్కడి భద్రతా ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్టు రోడ్డు సేఫ్టీ సిబ్బంది తెలిపారు. వివరాల్లోకి వెళితే... ఓ వ్యక్తి మోటార్ సైకిల్‌పై మహిళలను ఎక్కించుకుని రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు వస్తుండగా స్థానిక ఆదిత్య ఆస్పత్రి సమీపంలోకి వచ్చేసరికి మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వనదుర్గ అమ్మవారికి ఘనంగా చండీ హోమం

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి చండీహోమం, తొలి పావంచా వద్ద కొలువైన కనకదుర్గమ్మ, సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు లక్ష కుంకుమార్చనలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చండీహోమం ప్రారంభించారు. పదకొండు గంటలకు పూర్ణాహుతి అనంతరం, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అమ్మవారికి ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. వేద పండితులు ఉపాధ్యాయుల రమేష్, అర్చకులు దత్తాత్రేయ శర్మ, కోట వంశీ, వ్రత పురోహితులు చెళ్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్, పరిచారకులు ఫణి తదితరులు హోమం, ఇతర పూజలు నిర్వహించారు.



చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

పల్లెల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

కోటనందూరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పల్లెల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది శుక్రవారం సాయంత్రం ఫాగింగ్ చేశారు. కోటనందూరులో ఫాగింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ గ్రామాల్లో దోమలను అరికట్టేందుకు ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. పల్లెల్లో చెత్త, మురుగు, వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



కోటనందూరులో ఫాగింగ్ చేయిస్తున్న పంచాయతీ అధికారులు